

## కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఆత్మీయ వీడ్కోలు


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 7 మే 2026 | ■ 11 పేజీలు


■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు కురుస్తున్న వర్షం.. ఆరుగాలం శ్రమించిన పంటను ఎక్కడ తుడిచిపెట్టుకుపోతుందో అన్న ఆందోళన.. ఆ అన్నదాతల కళ్లల్లో నిద్రను దూరం చేసింది. తడిసి ముద్దవుతున్న ధాన్యాన్ని చూసి తట్టుకోలేక, కట్టుకున్న ప్రాణాల కంటే పండించిన పంటనే మిన్నగా భావించి, కారు చీకట్లో కల్లానికి పరుగులు తీశారు. కానీ, అపారమైన ఆ ప్రేమను ప్రకృతి అర్థం చేసుకోలేదు. రక్షణ ఇస్తుందనుకున్న గోడలే మృత్యుపాశాలవుతాయని, అక్కున చేర్చుకోవాల్సిన షెడ్డే సమాధి అవుతుందని వారు ఊహించలేదు. గుప్పెడు మెతుకుల కోసం చేసిన పోరాటంలో ఆ నిరుపేద రైతులు ఓడిపోయారు. పంటను కాపాడుకోబోయి ప్రాణాలనే ధారపోశారు. 'లే డాడీ.. ఒక్కసారి చూడవా' అంటూ ఓ చిన్నారి తండ్రి భౌతిక కాయం వద్ద చేస్తున్న ఆర్తనాదాలు చూస్తుంటే, కాలం చేసిన గాయానికి మందు లేదనిపిస్తోంది. ఒకే చితిపై తండ్రీకొడుకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే, లక్షెట్టిపేట మండలం కన్నీటి సంద్రమైంది. ప్రకృతి ప్రకోపానికి బలైపోయిన ఆ నిరుపేద కుటుంబాల గాథలు వింటుంటే.. విధి ఎంత బలీయమైనదో, అన్నదాత బతుకు ఎంత అభాగ్యమైనదో అర్థమవుతోంది.




# అన్నదాతపై ప్రకృతి పగ

# ప్రాణం తీసిన ధాన్యం రక్షణ



- ■ లక్షెట్టిపేట మండలంలో ఘోర విషాదం
- ■ ఈదురు గాలుల బీభత్సానికి గోడ కూలి లక్షెట్టిపేటలో నలుగురు రైతుల దుర్మరణం
- ■ పంటను కాపాడుకోబోతే.. ప్రాణాలే పోయాయి
- ■ అన్నంపెట్టే కల్లమే కాటిగా మారిన వైనం
- ■ ఒకే కుటుంబంలో తండ్రీకొడుకుల మృతి
- ■ గంపలపల్లి, కొత్తూరు గ్రామాల్లో అలుముకున్న చీకటి
- ■ 'లే డాడీ.. ఒక్కసారి చూడవా' కన్నకూతురి ఆర్తనాదాలతో ద్రవించిన హృదయాలు
- ■ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

9లో

## సాగులో సరికొత్త విప్లవం



2

- ■ పొన్నారిలో డ్రోన్ సాంకేతికతను పరిశీలించిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- ■ తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం..
- ■ ఖర్చు తగ్గించుకోవాలని రైతులకు సూచన

## పశువుల రవాణాపై 'జీరో టాలరెన్స్'



6

- ■ రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా
- ■ సమాచారం ఉంటే 100కు కాల్ చేయండి

## ఆదిలాబాద్‌కు మళ్లీ సున్నా

■ కన్నెర్ర చేసిన కాంగ్రెస్ శ్రేణులు ■ అడవి బిడ్డల ఆశలపై నీళ్లు ■ అధిష్టానం చూపు పక్క జిల్లాల వైపు!


■ నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకు దక్కని చోటు ■ 20 కార్పొరేషన్ల జాబితాలో 'ఉమ్మడి' ఊసే లేదు!

■ సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ హామీలు బుట్టదాఖలు.. ■ నమ్మి వచ్చిన నేతలకు మొండిచేయి

■ పక్క జిల్లాలకు పదవుల పండగ ■ క్యాడర్‌లో పెల్లుబుకుతున్న అసంతృప్తి ■ పార్టీ బలోపేతంపై నీలినీడలు

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవుల పంపకం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర దుమారాన్ని రేపుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఏదో ఒక రోజు తమకు గుర్తింపు లభిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్న జిల్లా నేతలకు తాజాగా ప్రకటించిన 20 కార్పొరేషన్ చైర్మన్ల జాబితా మరోసారి 'బిగ్ షాక్' ఇచ్చింది. జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ ఒక్క నేతకూ తాజా జాబితాలో చోటు దక్కకపోవడం జిల్లా పట్ల ప్రభుత్వ వివక్షకు పరాకాష్టగా మారింది.



10

## అకాల వర్షం.. అపార నష్టం

10

- ■ కొనుగోలు కేంద్రాల్లో నీట మునిగిన ధాన్యం
- ■ 3వేల ఎకరాల వరి, 411 ఎకరాల మామిడికి నష్టం
- ■ విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు
- ■ ఎగిరిన ఇళ్ల పైకప్పులు, కూలిన గోడలు..



మంచిర్యాల జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం వివిధ మండలాల్లోని రైతులు, ప్రజలకు అపార నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంతో పాటు కోతకు వచ్చిన పంట తడిసి ముద్దకాగా, మామిడి నేలరాలి తీరని నష్టం వాటిల్లింది. ఊహించని రీతిలో అర్ధరాత్రి చెల రేగిన గాలివాన జిల్లాలో బీభత్సం సృష్టించింది.



## డ్రోన్ సాంకేతికతతో వ్యవసాయంలో
# విప్లవాత్మక మార్పులు

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**తాంసి, మే 6 (ప్రభాత సమాచారం)**
దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం తాంసి మండలం పొన్నారి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి సంయుక్తంగా కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించిన "డ్రోన్ సాంకేతికత ద్వారా నువ్వుల విత్తే విధానం" ప్రదర్శనను ఆయన పరిశీలించి వివరాలను వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా విత్తనాలు చల్లే ప్రక్రియను ఆయన స్వయంగా పరిశించి, డ్రోన్ ఏ విధంగా పని చేస్తుంది, విత్తనాలను ఎంత వేగంగా, ఎంత సమానంగా చల్లుతుంది అనే అంశాలపై శాస్త్రవేత్తలు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సాంప్రదాయ పద్ధతుల్లో విత్తనాలు విత్తడం వల్ల సమయం, శ్రమతో పాటు విత్తనాల వృథా ఎక్కువగా ఉంటుందని, డ్రోన్ల వాడకం ద్వారా వీటిని సమర్థవంతంగా అధిగమించవచ్చని అన్నారు. డ్రోన్ల ద్వారా విత్తనాలు చల్లడం, మందుల పిచికారీ చేయడం వల్ల కూలీల కొరత సమస్య తీరడమే కాకుండా, సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని వివరించారు. వినూత్న ఆవిష్కరణలను రైతులకు చేరువ చేసేందుకు జిల్లా యంత్రాంగం, కృషి విజ్ఞాన కేంద్రం నిరంతరం కృషి చేస్తున్నాయని, రైతులు ఈ తరహా ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ ఖర్చు తక్కువతో కూడిన పరిష్కారాలను రైతులకు చూపేందుకు ఈ క్షేత్రస్థాయి ప్రదర్శన ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ ఆత్మ చైర్మన్ కౌడాల నారాయణ, ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త రాంగోపాల్ వర్మ, హాకా మేనేజర్ వెంకటేశ్వర్లు, జేడీఏ శ్రీధర్ స్వామి, గ్రామ సర్పంచ్ భూమన్న, రైతు కేమ లక్ష్మణ్, ఏవో రవీందర్, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.




# అడ్మిషన్ల పేరిట కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



### పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**
అడ్మిషన్ల పేరిట కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీని, విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పీడీఎస్‌యు ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్ పలు విషయాలను డీఈవో దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడారు. విద్య హక్కు చట్టం నిబంధనలను తుంగలో తొక్కి కార్పొరేట్ పాఠశాలలు చేస్తున్న అడ్మిషన్ల దోపిడిని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థలు బ్రోచర్లు కరపత్రాలు, గోడల మీద పోస్టర్లు అంటిస్తూ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులతో అడ్మిషన్లు చేయిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా టెక్నో, ఒలింపియాడ్, జీనియస్, ఇంటర్నేషనల్ పేర్లతో భారీ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కొన్ని విద్యాసంస్థలు హై స్కూల్ పర్మిషన్‌తో ప్రైమరీ స్కూల్ అడ్మిషన్లు చేస్తూ ఒకే చోట స్కూల్ పేరుతో మరికొన్నిచోట్ల తరగతులు నడిపిస్తున్నారని అన్నారు. జిల్లాలో ముందస్తు అడ్మిషన్ల పేరిట ప్రైవేట్ పాఠశాలలు చేస్తున్న దోపిడీపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలల గుర్తింపును రద్దు చేసే విధంగా విద్యాశాఖ ముందుకు రావాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాల ఫీజు దోపిడీపై దృష్టి సారించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా నాయకులు ఉన్నారు.



## తెలంగాణ యువతకు
# ఇజ్రాయెల్‌లో ఉపాధి అవకాశాలు

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ఇజ్రాయెల్ ప్రతినిధులతో మంత్రి వివేక్ వెంకటస్వామి హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్‌లో ఉన్న టామ్‌కామ్ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇజ్రాయెల్‌లోని నిర్మాణ రంగంలో ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. 'ఉద్యోగాల కల్పనకు ఎన్‌ఎస్‌డీసీఐ, పీఐబీఏ భాగస్వామ్యంతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, బ్లాక్ మేసన్, డ్రై వాల్ వంటి విభాగాల్లో అభ్యర్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఇజ్రాయెల్ నుంచి 1,200 మంది కార్మికుల డిమాండ్ ఉండటంతో, అందుకు తగినట్లుగా కార్మికులను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం 2025 నవంబర్‌లో ప్రీ-స్కిల్ టెస్ట్‌ను నిర్వహించగా, ఇందులో 4,247 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ కార్య దర్శి దాసరి హరిచందన, టామ్‌కామ్ డైరెక్టర్ కాంతి వెస్లీ పాల్గొన్నారు.

## ఓటర్ నమోదులో బీఎల్‌ఏల పాత్ర కీలకం

**ఖానాపూర్, మే 6 (ప్రభాత సమాచారం)**
ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం నిర్మల్ జిల్లాలో బీఎల్‌ఏ ఇంచార్జీల సమావేశంలో మాట్లాడుతూ, ఓటర్ నమోదులో బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్‌ఏల) పాత్ర కీలకమని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఎల్‌ఏలు తమ గ్రామాల్లో ఓట్లను గుర్తించడం ద్వారా బీజేపీ చేస్తున్న ఓట్ చోరీని అరికట్టవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీలోపు బీఎల్‌ఏల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్మల్ మున్సిపాలిటీ నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులు డీసీసీ అధ్యక్షులను సన్మానించారు.

# రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలి : బీఆర్ఎస్





**లక్సెట్టిపేట, మే 6 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలంలో అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాలకు గోడ కూలి మృతి చెందిన రైతుల కుటుంబసభ్యులను బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పరామర్శించారు. సర్కారు నిర్లక్ష్యంతో చనిపోయిన రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావుతో కలిసి లక్సెట్టిపేట పట్టణంలోని స్థానిక ఊట్కూరు చౌరస్తాలో ఉదయం 10 గంటలకు ధర్నాకు దిగారు. అధికారులు రావాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతుల మృతికి కారకులైన అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని భీష్మించుకుని కూర్చున్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ రాకపోవడంతో ఆయన వచ్చే దాకా ఇక్కడి నుంచి కదిలేది లేదని, బాధితులకు న్యాయం చేయాలని ధర్నా కొనసాగిస్తున్నారు. నాలుగున్నర గంటలుగా ధర్నా కొనసాగుతున్నది.

**బీఆర్ఎస్ ఆందోళనతో దిగొచ్చిన కాంగ్రెస్ సర్కార్**
**రైతుల కుటుంబాలకు హామీ..!**

లక్సెట్టిపేట మండలంలో అర్ధరాత్రి కురిసిన అకాల వర్షాలకు గోడ కూలి మృతి చెందిన రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావుతో కలిసి లక్సెట్టిపేట పట్టణంలోని స్థానిక ఊట్కూరు చౌరస్తాలో ధర్నాకు దిగారని తెలిసిందే. బాధిత కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నాలుగు గంటలకుపైగా ధర్నా చేపట్టారు. వారి ధర్నాకు అధికార యంత్రాంగం దిగొచ్చింది. బీఆర్ఎస్ ఉదయం నుంచి చేపట్టిన ఆందోళనతో కాంగ్రెస్ సర్కార్ దిగొచ్చింది. ప్రభుత్వంతో మాట్లాడి బాధిత కుటుంబాలకు 50 లక్షల రూపాయలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ రాములు మృతుల కుటుంబాలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో విరమించారు. లక్సెట్టిపేట మండలం ఉత్కూరు , గంపలపల్లిలలో ఈదురుగాళ్లకు గోడ కూలి ముగ్గురు రైతులు, ఓ విద్యార్థి మృతి చెందారని తెలిసిందే.



## నిరుద్యోగ యువతకు
# ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం





### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రాష్ట్ర క్రీడలు, యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన భారీ జాబ్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలను కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇలాంటి మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తోందని తెలిపారు. యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే వేచి చూడకుండా, ప్రైవేటు రంగంలో ఉన్న అపారమైన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యాలు ఎంతో కీలకమని, చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తిపరమైన మెళకువలను పెంపొందించుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని యువతకు దిశానిర్దేశం చేశారు. నియామక పత్రాలు అందుకున్న వారు క్రమశిక్షణతో ఉన్నతంగా స్థిరపడాలన్నారు. అంతకుముందు వివిధ కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఎంపిక ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, ఉపాధి కల్పన అధికారి మిల్కా, యువత, నిరుద్యోగులు, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యపు సంచులు నిల్వ చేయడానికి అదనపు స్థలాలు సమకూర్చుకోవాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా





**సారంగాపూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

ధాన్యపు సంచులు నిల్వ చేయడానికి ముందు జాగ్రత్తగా అదనపు స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం సారంగాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి గోదామును వెంటనే సిద్ధం చేయాలన్నారు. అవసరమైతే అదనంగా ధాన్యపు సంచులు నిలువ చేయడానికి స్థలాలను అన్వేషించాలని అన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యాన్ని అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. సిసి కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, తహసిల్దార్ విజయ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మీకాంతరావు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాలను విజయవంతం చేయండి






### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**తాంసి, మే 6 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 4 నుండి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న "రైతు వారోత్సవాలను" రైతులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. బుధవారం తాంసి మండలం హస్నాపూర్ గ్రామ రైతు వేదికలో నిర్వహించిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి రైతు దరికి చేర్చడానికి ఈ వారోత్సవాలు ఒక గొప్ప వేదికగా నిలుస్తాయని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సంప్రదాయ పద్ధతులను వీడి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని అలవర్చుకోవడం ద్వారా సమయం ఆదా అవ్వడమే కాకుండా, సాగు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని వివరించారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ వారోత్సవాలను రూపొందించాలన్నారు. రైతులు కేవలం సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న ఉద్యానవన పంటలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని కోరారు. ఇందుకు అవసరమైన పూర్తి సాంకేతిక సహకారాన్ని, సలహాలను జిల్లా యంత్రాంగం తరపున అందిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలను ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ల ప్రదర్శన, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖల స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీఓ అవినాష్, ఐడీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ భూమ్ రెడ్డి, ఏఓ రవీందర్, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన
# నూతన డీఆర్వో స్రవంతి

**బాధ్యతల స్వీకరణ అనంతరం మర్యాదపూర్వక భేటీ**
**పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన వైనం**
**పాలనలో చురుకైన పాత్ర పోషించాలని కలెక్టర్ సూచన**

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం):**

ఆదిలాబాద్ జిల్లా నూతన జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన స్రవంతి గారు బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను వారి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభివాదం చేశారు. కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ, జిల్లా యంత్రాంగంలో రెవెన్యూ విభాగానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. పాలనాపరమైన అంశాల్లో చురుగ్గా వ్యవహరిస్తూ జిల్లా అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని
# కలిసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

**కోర్టు కార్యాలయంలో మర్యాదపూర్వక భేటీ**
**పలు కీలక అంశాలపై ఇరువురి మధ్య చర్చ**

**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం):**

నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణిని కోర్టు కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన న్యాయమూర్తికి పూలమొక్కను అందజేసి అభివాదం తెలిపారు. అనంతరం జరిగిన భేటీలో జిల్లాకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించారు.



# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి





**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, పౌరసరఫరాల శాఖ అధికారులు, రవాణా గుత్తేదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న వరి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో గోదాములను తక్షణమే ప్రారంభించి, ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని నిల్వ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 10 రైస్ మిల్లులు పని చేస్తున్నాయని, సుముఖ్ గోదాం సామర్థ్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండగా, ఇతర గోదాముల సామర్థ్యం మొత్తం 61 వేల మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఈ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం రైస్ మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు ఇప్పటికే విడుదల చేసినందున మిల్లర్లు ఆలస్యం చేయకుండా బిల్లుల ప్రకారం వరి ధాన్యం తీసుకుని మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మిల్లుల బ్యాంక్ గ్యారంటీలను సమీక్షించి, అర్హత ఉన్న మిల్లులకు వరి ధాన్యం విడుదల చేయాలని, జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రవాణా వాహనాలను మిల్లులకు తగిన విధంగా కేటాయించి, వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి తప్పనిసరిగా శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో సన్నాల సాగు 90 శాతానికి పైగా ఉన్నందున, కొనుగోలు పరిమాణాన్ని గత సంవత్సరాల కంటే మరింత పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. జిల్లాలో అందుబాటులో ఉన్న గోనె సంచులను మిల్లర్లు పరస్పర అవగాహనతో అవసరమైన చోట వినియోగించుకోవాలని, గోనె సంచుల కొరత ఎక్కడా లేకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తమ బాధ్యతలను క్రమంగా నిర్వర్తిస్తూ, రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో చెల్లింపులు జరిగేలా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా సహకార శాఖ అధికారులతో వరి ధాన్యం కొనుగోలు పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ సంవత్సరంలో జిల్లాలో వరి ధాన్యం దిగుబడి అంచనా సుమారు 1 లక్ష 50 వేల మెట్రిక్ టన్నుల నుండి 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వచ్చే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాలలో వరి శుభ్రపరిచే యంత్రాలను ఏర్పాటు చేసి, రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో హమాలి చార్జీలకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రవాణా గుత్తేదారులతో కుదుర్చుకున్న ఒప్పందాలు పూర్తైన తర్వాత మాత్రమే రవాణా చార్జీలు చెల్లించబడతాయని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమయానికి సేవలు అందేలా సహకార శాఖ, సంబంధిత విభాగాలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### సొంత గూడు కల్పించడమే

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**సోనాలలో నూతన గృహాలను ప్రారంభించిన కాంగ్రెస్ ఇన్చార్జి ఆడే గజేందర్**

**బోథ్, మే 6 (ప్రభాత సమాచారం):**

రాష్ట్రంలోని నిరుపేదలకు నిలువ నీడ కల్పించాలన్న ధ్యేయంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ' పథకాన్ని అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తోందని నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. బుధవారం సోనాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారుల ఆహ్వానం మేరకు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఉద్దేశమని అన్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు నీడ దొరికిందని, అదే స్ఫూర్తితో ఇప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ ఎల్. పోశెట్టి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చౌహాన్ సాయన్న, భీమ్ రావు మరియు ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు

# కేంద్రాల ద్వారా వరిధాన్యం నుగోలు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జైపూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల, ఇందారం, షెట్‌పల్లి, నర్సింగాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్





మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి రైస్ మిల్లులకు తరలించాలని, రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### వంతెన పనులు

# నాణ్యతగా చేపట్టాలి

**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత**

**చింతలమానేపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**

దిందా వాగుపై చేపడతున్న హైలెవల్ వంతెన పనులు నాణ్యతగా చేపట్టాలని కలెక్టర్ కె హరిత అన్నారు. వంతెన పనులు చేపడుతున్న తీరును పరిశీలించి బుధవారం స్థానికుల ద్వారా పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఏటా ఇబ్బందులు పడుతున్నామని వారు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వంతెన నిర్మాణం పూర్తైతే ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. వంతెన పనులు శరవేగంగా చేపట్టాలని, ఇంజనీరింగ్ అధికారులు ప్రతీ రోజు పర్యవేక్షించాలని సూచించారు. ఈ వంతెన పూర్తి అయితే గ్రామస్థులు చాలా కాలం నుండి ఎదుర్కొంటున్న రవాణా సమస్య తీరిపోతుందన్నారు. సంబంధిత అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### రోగులకు మెరుగైన సేవలు అందించాలి...

ప్రాథమిక కేంద్రాల్లో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది సమయ పాలన పాటించి ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కె హరిత అన్నారు. రవీంద్రనగర్‌లో గల గంగాపూర్ బాబాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, మందుల నిల్వ, వార్డులు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలిం చారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఆస్పత్రిలో సరిపడా మందుల నిల్వలు ఉంచుకోవాలని చెప్పారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సూపర్ వైజర్లుతమ పరిధిలోని గ్రామాలను ప్రతి రోజు సందర్శించి గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిస్థితిని వైద్య సేవల వివరాలను నమోద చేయాలని సూచించారు. సిబ్బంది సమయ పాలన పాటించకుంటే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

# అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ రుసుములపై 25 శాతం రాయితీ

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**

అనధికార/అనుమతి లేని లే అవుట్ల నియమావళి క్రింద ప్రభుత్వ ఉత్తర్వులు 131 ప్రకారం రుసుములు, చార్జీల చెల్లింపులపై 25 శాతం రాయితీ కల్పించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31వ తేదీ వరకు అవకాశం కల్పించడం జరిగిందని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీల పరిధిలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుదారులు నిర్ణీత గడువులోగా తమ ఎల్ ఆర్ ఎస్ రుసుము చెల్లించి 25 శాతం రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని, గడువు అనంతరం ఎటువంటి రాయితీ వర్తించదని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్, బెల్లంపల్లి, క్యాతనపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల పరిధిలో 45 వేల 863 దరఖాస్తులు రాగా 5 వేల 97 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని, 1 వేయి 723 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని, 39 వేల 43 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీలలో 10 వేల 742 దరఖాస్తులు రాగా, 7 వేల 674 మంది దరఖాస్తుదారులకు రుసుము చెల్లింపు కొరకు లేఖలు జారీ చేయడం జరిగిందని, 2 వేల 402 దరఖాస్తుదారులు రుసుము చెల్లించగా 1 వేయి 58 మంది దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. దరఖాస్తుదారులు సంబంధిత మున్సిపల్



కార్పొరేషన్/మున్సిపల్ కార్యాలయం/గ్రామపంచాయతీ కార్యాలయాలలో సంప్రదించాలని, ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# పెంచిన గ్యాస్ ధరలు, పెట్రోల్, డీజిల్ కొరతపై సీపీఐ ఆందోళన

**బెల్లంపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను, పెట్రోల్, డీజిల్ కొరత కు నిరసనగా బెల్లంపల్లిలో కాంట చౌరస్తా వద్ద సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి గారు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్యాస్ పెట్రోల్ డీజిల్ అధిక ధరలు కొరత వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రాష్ట్రంలో పంట కోతల సమయంలో డీజిల్ లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొరతలేదని పాలకులు ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదనీ మండిపడ్డారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ల ధరలను రూ. 993 పెంచడంతో రూ.3100 కు చేరుకున్నదన్నారు. సామాన్య ప్రజలు అలాగే డీజిల్ పెట్రోల్ మీద లీటరుకు 5/-రూపాలు గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయలు పెంచడానికి ఆయిల్ కంపెనీలు ప్రతిపాదనలు పంపించేయని తెలిపారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలను మోడీ ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం యుద్ధం కంటే ముందు బ్యారెల్ ముడిచమరుద్దర 72 డాలర్లు ఉంటే ఇప్పుడు 126 డాలర్లకు చేరుకున్నదినీ తెలిపారు. తాజగా కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరల వలన హోట ల్స్, రెస్టారెంట్లు, చిన్న పెద్ద ఆహార వ్యాపారాల మీద పడుతున్నదనీ వాపోయారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచినట్లయితే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ద్రవియోల్బణం పెరుగుతుందన్నారు. అమెరికా ఇరాన్ యుద్ధం వలన భారతదేశానికి ఎలాంటి ప్రమాదం లేదని, చమురు గ్యాస్ నిలువలు ఉన్నాయని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు గ్యాస్ ధరలు పెంచుతున్నట్లు, పెట్రోల్ బంకుల వద్ద ఎందుకు బారులు తీరిన జనం ఎందుకు ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం పొంతన లేని సమాధానా లతో ప్రజల ను మోసం చేస్తున్నదని విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, డిజిల్ కొరతలను నివారించాలని, ఆయిల్



కంపెనీల ప్రతిపాదనలు ఆమోదించవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, కొంకుల రాజేష్, రత్నం రాజం, మేకల రాజేశం, సీనియర్ నాయకులు జూపాక కొమురయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు బొంతల కళారాణి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



## ఐటీడీఏ పీవో మకరందును
# కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఉట్నూర్, మే 6 (ప్రభాత సమాచారం):**

ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మంద మకరందును ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసిన ఎమ్మెల్యే, ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి పీవోను శాలువాతో ఘనంగా సన్మానించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి ఏజెన్సీ ప్రజల సంక్షేమం కోసం నూతన పీవో తన పరిపాలనలో విశేష కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. ఈ భేటీలో స్థానిక నాయకులు మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు రుణాలు, కొనుగోలు
# కేంద్రాలపై అవగాహన

**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

ప్రజా పాలన ప్రగతి-ప్రణాళిక 'రైతు వారవం'లో భాగంగా మూడవ రోజు ఆసిఫాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జనకాపూర్ రైతు వేదికలో కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షుడు అలీబిన్ హైమద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు, ట్రాక్టర్ లోన్లపై అవగాహన కల్పించారు. రుణాలు తీసుకునే సమయంలో ఉన్న ఉత్సాహంతోనే తిరిగి చెల్లించాలని, అప్పుడు ప్రభుత్వ ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు. అలాగే రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా, దళారుల మోసాలకు గురికాకుండా సహకార సంఘాల ద్వారా కందులు, మక్కలు, జొన్నల కొనుగోలు కేంద్రాల వద్ద గిట్టుబాటు ధరకు పంటలు అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రుకుం ప్రహ్లాద్, ఏవో మిలింద్, జిల్లా సహకార బ్యాంక్ మేనేజర్ వెంకట రవీందర్, ఎస్బిఐ మేనేజర్ తిరుపతి, సహకార సంఘం సెక్రెటరీ వెంకటరమణతో పాటు రైతులు చాపల రమేష్, వ్యాపార లక్ష్మి, కవల్కర్ శంకర్, రాంతంకి శంకర్, జాలింషా పాల్గొన్నారు.




## చెక్‌పోస్టుల వద్ద
# అప్రమత్తంగా ఉండాలి

**సిర్పూర్ (టి), మే 6 (ప్రభాత సమాచారం)**

చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ కె హరిత అన్నారు. సిర్పూర్(టి) మండలం పెద్దబండ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును బుధవారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ జిల్లాలో యాసంగి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో పక్క రాష్ట్రల నుంచి వరిధాన్యం అక్రమంగా రవాణా అయ్యే అవకాశం ఉందన్నారు. వాహనాలను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించలన్నారు. మత్తు పదార్థల అక్రమ రవాణా జరిగే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచిచారు.. నిషేధిత పత్తి విత్తనాలు, గడ్డి మందుల రవాణా జరిగే అవకాశం ఉన్నందున విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

# కులర్ కరెంట్ షాక్‌తో బాలుడికి గాయాలు



**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

మండలంలోని బనార్ గొంది గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఒక బాలుడు గాయపడ్డాడు. గ్రామానికి చెందిన ఆత్రం మారు కుమారుడు ఆత్రం అజయ్ తన ఇంట్లో కూలర్ ఆన్ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం అతడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్ వెంటనే జిల్లా ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. అజయ్‌కు అందుతున్న ప్రథమ చికిత్సను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం డ్యూటీలో ఉన్న వైద్యులతో మాట్లాడి బాలుడికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆందోళనలో ఉన్న బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం అజయ్‌కు వైద్యం అందుతోందని, ప్రమాదం ఏమీ లేదని వైద్యులు స్పష్టం చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.



## డీఎస్పీని కలిసిన
# బీఆర్ఎస్ నాయకులు

**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి. అశోక్ ను బుధవారం ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండీ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బీన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి డీఎస్పీని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలకృష్ణ, సాలం బీన్ అహ్మద్, మాజీ సర్పంచ్ బలరాం నాయక్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ నిసార్, సాయి శ్రావణ్ పాల్గొన్నారు.

## డీఎస్పీని కలిసిన
# కాంగ్రెస్ నాయకులు

**ఆసిఫాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

ఇటీవల డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ ను గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్ , మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరకుల్లా మంగ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డిఎస్పికి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాపర్తి కార్తీక్, వార్డు సభ్యులు జావిద్, ఎండి ఆసిఫ్ అలీ,టౌన్ ప్రెసిడెంట్ రఫిక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్లా, తాజ్, జాలింషా, సాయి బండి సాయి శేఖర్, జమీర్ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన ప్రాంతాలలో అమలు చేస్తున్న
# కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలి

### సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు

**ఉట్నూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ-ఉట్నూర్ పరిధిలోని గిరిజన ప్రాంతాలలో అమలు చేస్తున్న కార్యక్రమాల లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అన్నారు. బుధవారం కొమురం భీం కాంప్లెక్స్‌లోని పిఎంఆర్సిలో గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన సహకార సంస్థ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో అమలు చేస్తున్న సహకార సంస్థ కార్యక్రమాలు లక్ష్యాలను సాధించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గిరిజనుల జీవనోపాధి మెరుగుపరిచే దిశగా మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ కరణ, కొనుగోలు, నిల్వ, మార్కెటింగ్ అంశాలలో పారదర్శకత పాటించాలని, గిరిజనులకు న్యాయమైన ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని, మధ్యవర్తుల జోక్యాన్ని పూర్తిగా నివారించాలని తెలిపారు. గిరిజన సహకార సంస్థ ద్వారా అందిస్తున్న సేవలు ప్రతి గ్రామానికి చేరేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, గిరిజనులకు అవగాహన



కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. అటవీ ఉత్పత్తుల విలువ, ఆధారిత ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలని తెలిపారు. సమీక్షలో భాగంగా అధికారులు తమ పరిధిలో చేపట్టిన పనుల పురోగతిని వివరించి, పనుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ప్రాజెక్ట్ అధికారి దృష్టికి తీసుకురాగా ప్రాజెక్టు అధికారి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం, అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# పశువుల అక్రమ రవాణాపై 'జీరో టాలరెన్స్'

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు..
- గోరక్షణ పేరుతో హింసకు పాల్పడొద్దు..
- సమాచారం ఉంటే 100కు కాల్ చేయండి
- సరిహద్దుల్లో 8 ప్రత్యేక చెక్ పోస్టుల ఏర్పాటు
- నిబంధనలు అతిక్రమిస్తే వాహనాల సీజ్, కేసులు

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**

పశువుల అక్రమ రవాణాపై ఎంత మాత్రం ఉపేక్షించేది (జీరో టాలరెన్స్) లేదని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. బుధవారం సీపీ కార్యాలయంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ (వీహెచ్‌పీ యువజన విభాగం), రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, హిందూవాహిని, శ్రీరామ్ సేన, హిందూ యువవాహిని సభ్యులతో పశువుల అక్రమ రవాణా నిరోధంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో సీపీ మాట్లాడారు. పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని, ఆవులు, దూడల అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, వ్యక్తిగత దాడులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. పశువులను తరలించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో రాజీ ఉండదన్నారు.

**ఎనిమిది చెక్ పోస్టులు ఏర్పాటు...**

రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ఐదు (మంచిర్యాల జిల్లాలోని దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-63 రోడ్డుపై గూడెం చెక్‌పోస్ట్ వద్ద, జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందన్‌పల్లి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద,



కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రాపన్‌పల్లి చెక్‌పోస్ట్ వద్ద, జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల సరిహద్దు ఇందారం చెక్‌పోస్ట్ వద్ద, తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రేపల్లెవాడ చెక్‌పోస్ట్ వద్ద ) చెక్ పోస్టులు, పెద్దపల్లి జిల్లా పరిధిలో మూడు (బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బసంత్‌నగర్ టోల్‌గేట్ చెక్‌పోస్ట్ వద్ద, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దుబ్బపల్లి చెక్‌పోస్ట్ వద్ద, సుల్తానాబాద్, గుంపుల ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టు) చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**రాత్రింబవళ్లు ప్రత్యేక డ్రైవ్‌లు...**

మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఎనిమిది ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి రాత్రింబవళ్లు వాహనాలను తనిఖీ చేస్తున్నామని సీపీ తెలిపారు. వీటితో పాటు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామన్నారు. పశువులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇది మూగజీవాల పట్ల క్రూరత్వానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పశువుల రవాణాకు సంబంధించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ యాక్ట్, కౌ స్లాటర్ యాక్ట్, భారతీయ న్యాయ సంహిత చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేయనున్నట్లు హెచ్చరించారు.

**తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు...**

సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, వాస్తవాలు నిర్ధారించకుండా వాటిని పంచుకోవద్దని ప్రజలకు సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఎవరైనా పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే రామగుండం పోలీస్ కంట్రోల్ రూమ్ (8712656597), డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సామాజిక సామరస్యాన్ని కాపాడేలా, మూగజీవాల రక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, తాండూర్ సీఐ దేవయ్య, ఆర్ఐ పెద్దన్న, రమేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.



## ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయడం హర్షణీయం

**మంచిర్యాల, మే 6 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల టూ టౌన్ ప్రాం తానికి రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రధాని మోదీ మంజూరు చేయడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని పలుమార్లు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంకు వినతి పత్రాలు అందించామన్నారు. దీం తో రైల్వే అధికారులు సుమారు రూ. 4 కోట్లతో గత ఏడాది ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేశారన్నారు. ఈ నేపధ్యంలో రైల్వే అధికారులు మంచిర్యాల ము న్సిపల్ కమిషనర్‌కు బుధవారం నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం లేఖ రాయడం తో వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి క్లియరెన్స్ కోసం నో ఆబ్జెక్షన్ సర్టిఫి కెట్లు మంజూరు చేయాలని కోరామన్నారు. ఈ బ్రిడ్జి పూర్తయితే వేల మంది ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ప్రధాని మోదీ అన్ని వర్గాల సం క్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముకేష్‌గౌడ్, అనిత, నాగరాజు, పురుషోత్తం జాజు, వెంకటేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, ప్రేమ్ సింగ్, వెంకటేష్, తరుణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ ఛైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

**చెన్నూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల పీఏసీఎస్ ఛైర్మన్‌గా పెద్దపోలు సాంబాగౌడ్ బుధ వారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేసి పాలక వర్గాలకు కోర్టు అనుకూలంగా తీర్పునివ్వడంతో ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. తొలగించిన పాలక వర్గాలను యథావిధిగా కొనసాగింపులో భాగంగా తిరిగి అధికారం అప్పగించడంతో బుధవారం అధ్యక్షుడితోపాటు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.



### నిర్మల్ జిల్లాలో జొన్నల కొనుగోలు

## కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆందోళన



**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం)**

మొక్కజొన్న, జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతుల ఆందోళన చేపట్టారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి గ్రామ రైతులు నిర్మల్- బైంసా జాతీయ రహదారిపై బైఠాయించారు. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే కొనుగోలు కేంద్రాలు లేక పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేక, అప్పులు చేసి పండిస్తే తీరా దాళారులకు అమ్మాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జిల్లా కలెక్టర్ వచ్చి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## కొత్తూరులో రైతుల రాస్తారోకో

**లక్షెట్టిపేట, మే 6 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం కొత్తూరు గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై బుధవారం రైతులు రాస్తారోకో నిర్వహించి ధర్నా చేపట్టారు. వడ్ల తూకంలో రైస్ మిల్లర్లు 40 కిలోల సంచికి నాలుగు కిలోల వడ్లు అదనంగా తీసుకుంటున్నారని రైతులు ఆరోపించారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో వడ్లు తడిసి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి వరి తూకంలో జరుగుతున్న మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. లారీ డ్రైవర్లు కూడా సంచికి రెండు కిలోలు అదనంగా వడ్లు ఇస్తేనే లోడింగ్‌కు వస్తామని చెబుతున్నారని రైతులు పేర్కొన్నారు. జిల్లా అధికారులు తక్షణం స్పందించి వరి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

## కలెక్టర్‌కు కలిసిన ఐటీడీఏ పీవో

**కలెక్టరేట్ ఛాంబర్‌లో మర్యాదపూర్వక భేటీ**

**ఐటీడీఏ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘ చర్చ**

**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం):**

ఐటీడీఏ పీవో మంద మకరందు బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీవో కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి అభివాదం తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు మరియు ఇతర పరిపాలనాపరమైన అంశాలపై వారు చర్చించారు. పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు అధికారుల మధ్య చర్చ జరిగింది.






## వేసవిలో విద్యార్థుల విజ్ఞాన వికాసానికి 'స్నేహ' హస్తం

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో గ్రామీణ ప్రాంత విద్యార్థుల విజ్ఞాన వికాసం కోసం జిల్లా యంత్రాంగం 'స్నేహ వేసవి సెలవుల శిబిరాన్ని' వినూత్నంగా నిర్వహిస్తోందనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన ఈ శిబిరాల సన్నాహకాలపై సమన్వయ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక పఠనానికే పరిమితం కాకుండా ఆటపాటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా విజ్ఞానాన్ని పొందేలా ఈ శిబిరాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ , సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో, అంతర్జాతీయ సంస్థ యునిసెఫ్ తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఈ శిబిరాలు జరగనున్నాయన్నారు. మారుమూల ప్రాంతాల్లోని విద్యార్థులకు సైతం ఈ శిబిరాలు చేరేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సహకారంతో పనిచేసి ఈ వేసవి శిబిరాలను విజయవంతం చేయాలని, విద్యార్థులు తమ సెలవులను వృధా చేసుకోకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఏ పీడీ రవీందర్, డిహెచ్మ్హెచ్వో నరేందర్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



### నరేంద్ర మోదీ సభకు
## భారీగా తరలిరండి
### ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో బీజేపీ కార్యకర్తలతో కలిసి గోడలపై పెయింటింగ్ నిర్వహించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఈ నెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలు మోదీ నాయకత్వంపై విశ్వాసం ఉంచుతున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు దీనికి నిదర్శనమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ అవసరమని పేర్కొన్నారు.ఆదిలాబాద్ ప్రజలు, యువత, మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో సభకు హాజరై మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

### అకాల వర్షంతో తడిసి
## ముద్దయిన వరి ధాన్యం


**చెన్నూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలో మంగళవారం రాత్రి భారీగా కురిసిన అకాల వర్షంతో రైతులు విలవిలలాడుతున్నారు. ఈదురు గాలులు అకాల వర్షంతో రైతులు ఆరబోసిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఒకవైపు ఐకెపి సెంటర్లలో మరియు పంట కళ్ళల్లో ఆరబోసిన ధాన్యం అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షంతో వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవ్వడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఒకవైపు అనుకున్నంత దిగుబడి రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న సందర్భంలో అకాల వర్షంతో పండిన ధాన్యం కూడా పూర్తిగా తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎటువంటి తాలు తరుగు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### సేవాలాల్ మహారాజ్
## బోధనలను అనుసరించాలి

**లింగాపూర్, మే 6 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో బుధవారం జగద్జనని జగదాంబ దేవి, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ,సంత్ తపస్వి డా.రామారావ్ మహారాజ్ల భోగ్ భండార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బంజారా కాశీ పొవరా దేవి పీఠాధిపతి, ఎమ్మెల్సీ బాబూసింగ్ మహారాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారా సమాజ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, భక్తిఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలను అనుసరిస్తూ ఇతరులతో మర్యాదగా ప్రవర్తించాలి, అబద్ధాలు, చాడీలు చెప్పకూడదని, దొంగతనాలకు పాల్పడకూడదని సూచించారు. గుడుంబా సేవించడం మానుకోవాలని, పెళ్లిళ్లు, శుభకార్యాల్లో అధిక ఖర్చులను తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్, నాయక్ రాథోడ్ కిరణ్ నాయక్, కారో బారి రాథోడ్ శివలాల్, సర్పంచ్ రాజశేఖర్, పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారంపై పోలీసులకు 'రెవెన్యూ' పాఠాలు

**భూ చట్టాలు, రికార్డులపై అధికారులకు అవగాహన కల్పించిన తహసీల్దార్ నలందప్రియ**
**భూమాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం**
**ఆదిలాబాద్ జిల్లాఎస్పీ అఖిల్ మహాజన్**
**నకిలీ పత్రాలుపై అప్రమత్తంగా ఉండాలని సూచన**
**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ప్రత్యేక శిక్షణ**



**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం):**

జిల్లాలో భూ వివాదాలను సమర్థవంతంగా పరిష్కరించడానికి మరియు భూమాఫియా అక్రమాలకు చెక్ పెట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ నేతృత్వంలో బుధవారం జిల్లాలోని పోలీసు అధికారులకు 'భూమి చట్టాలు - రెవెన్యూ రికార్డులు' అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో భీంపూర్ తహసీల్దార్ నలందప్రియ ముఖ్య వక్తగా పాల్గొని, పోలీసులకు రెవెన్యూ పరిభాషపై పట్టు సాధించేలా వివరించారు. విలేజ్ మ్యాప్, టిప్పన్, సేత్వార్ వంటి ప్రాథమిక రికార్డులను ఎలా పరిశీలించాలి. పహానీ (అడంగల్), ఈసీ (జుజ), టైటిల్ డీడ్ వంటి పత్రాల ప్రాముఖ్యత ఏమిటి? అసైన్డ్ భూములు, భూదాన్, ల్యాండ్ సీలింగ్ మరియు ఏజెన్సీ భూములకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు ఏమిటి? అనే అంశాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. భూమాఫియా ముఠాలు నకిలీ పత్రాలు సృష్టించడం, జీపీఏ దుర్వినియోగం చేయడం ద్వారా చేసే మోసాలను ఎలా గుర్తించాలో ఈ సందర్భంగా వివరించారు. భూ సంబంధిత ఫిర్యాదులు వచ్చినప్పుడు చట్టబద్ధంగా వ్యవహరిస్తూ బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. పోలీస్ అధికారులకు అత్యంత ఉపయోగకరమైన సమాచారాన్ని అందించినందుకు గాను తహసీల్దార్ నలందప్రియను ఎస్పీ అఖిల్ మహాజన్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక సాయి కొట్టే, డీఎస్పీ జీవన్ రెడ్డి, శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్ తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి



### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు

**మందమర్రి, మే 6 (ప్రభాత సమాచారం)**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు అన్నారు. బుధవారం మందమర్రి మండలం అందుగులపేటలోని వెంకటేశ్వర రైస్ మిల్లును సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల నుండి కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. ఒకరోజులో కనీసం 10 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### వైకల్యాన్ని జయించి..
## పదిలో సత్తా చాటిన సాయి చరణ్

**విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయినా వెనకడుగు వేయని వైనం**
**పదవ తరగతి ఫలితాల్లో 417 మార్కులతో అద్భుత విజయం సాధించిన సాయి చరణ్**
**విద్యార్థి ఆత్మవిశ్వాసాన్ని ప్రత్యేకంగా అభినందించిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, మే 6 (ప్రభాత సమాచారం)**

శారీరక వైకల్యం ఆశయానికి అడ్డంకి కాదని పట్టుదలతో నిరూపించిన విద్యార్థి మార్కొండు సాయి చరణ్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను సాయి చరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో జరిగిన ఒక విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులను కోల్పోయినప్పటికీ, అధైర్యపడకుండా చదువును కొనసాగించి పదో తరగతి ఫలితాల్లో 417 మార్కులు సాధించిన సాయి చరణ్ ప్రతిభను ఈ సందర్భంగా కలెక్టర్ కొనియాడారు. ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌కు చెందిన పొచ్చన్న కుమారుడైన సాయి చరణ్, స్థానిక సీ.బీ.ఆర్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. విధి వంచించినా, ప్రకృతి వైపరీత్యం తన చేతులను దూరం చేసినా.. ఆత్మవిశ్వాసాన్నే పెట్టుబడిగా మలచుకున్నాడు. ఎవరి సహాయం లేకుండా, తల్లిదండ్రుల ప్రోత్సాహం మరియు గురువుల సహకారంతో పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సాయి చరణ్ సాధించిన విజయం సామాన్యమైనది కాదని, జిల్లాలోని విద్యార్థులందరికీ అతను ఒక గొప్ప స్ఫూర్తిప్రదాత అని అన్నారు. వైకల్యం అనేది శరీరానికే పరిమితమని, మనసులో దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని చరణ్ నిరూపించాడన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, జిల్లా యంత్రాంగం తరపున అతడికి పూర్తి మద్దతు ఉంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం

**ఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్**



**కోటపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**

వడ్లు కొనడంలో ప్రభుత్వ జాప్యంతోనే రైతులకు నష్టం వాటిల్లిందని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ విమర్శించారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కోటపల్లి మండలంలోని పారుపల్లి గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన వడవ్లను విద్యాసాగర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడలేదని, రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోవాల్సిన మంత్రి పట్టణానికే పరిమితమయ్యాడని విమర్శించారు. వీడియోలు చేసి సోషల్ మీడియాలో పెడితే సమస్యలు తెలియవని, కొనుగోలు కేంద్రాలకు వచ్చి రైతులతో మాట్లాడితే వారి సమస్యలు తెలుస్తాయని మంత్రికి సూచించారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనాలని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కోటపల్లి మండల రైతులతో జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి సర్పంచ్ తొగురు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల నాయకులు కొట్టె నారాయణ, గోనె సత్యనారాయణ, పూరెళ్ళ సతీశ్, మహేశ్, దుర్గం కృష్ణదాస్, ఆసంపల్లి సంపత్, నూతన్, గుగ్లోత్ బాపు నాయక్ తదితరులు పాల్గొన్నారు.





## శ్రీదేవితో నా పెళ్లి జరగాల్సింది..

సీనియర్ హీరో రాజశేఖర్ ఒకప్పుడు యాంగ్రీ యంగ్ మ్యాన్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు కూడా సెకండ్ ఇన్నింగ్స్‌లో కొత్త రకాల పాత్రలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ఇటీవల శర్వానంద్ నటించిన 'బైకర్' సినిమాలో తండ్రి పాత్రలో కనిపించి మెప్పించారు.ఈ సినిమా ప్రమోషన్ సందర్భంగా ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాజశేఖర్, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు చెప్పారు. ముఖ్యంగా తన పెళ్లి ముందు జరిగిన సంఘటనలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.రాజశేఖర్, జీవిత ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే పెళ్లి కంటే ముందు ఆయన ఇంట్లో వేరే సంబంధం గురించి మాట్లాడారని తెలిపారు. ఆ సమయంలో శ్రీదేవితో పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు నిశ్చయించారని చెప్పారు. ఇద్దరూ ఒకే కులానికి చెందినవారు కావడంతో ఆమెనే పెళ్లి చేసుకోవాలని ఇంట్లో ఒత్తిడి చేసారట.ఈ విషయం జీవితకు చెప్పినప్పుడు, "మీరు వేరే పెళ్లి చేసుకుంటే మీ ఇష్టం, కానీ నేను మాత్రం జీవితాంతం పెళ్లి చేసుకోను" అని ఆమె చెప్పిందట. ఆ మాట విని తాను చాలా ఆశ్చర్యపోయానని రాజశేఖర్ గుర్తుచేసుకున్నారు.ఇంకా ఒక సరదా సంఘటనను కూడా ఆయన పంచుకున్నారు. తన ప్రేమ విషయం తెలియకుండా ఇంట్లో మరో అమ్మాయిని చూసారట. ఎవరు మంచిదో నిర్ణయించలేక, ఇద్దరినీ ఒకేసారి గుడికి రమ్మన్నారు. కానీ అక్కడికి వెళ్లాక ఆ ఇద్దరూ స్కూల్ ఫ్రెండ్స్ అని తెలిసి అందరూ ఆశ్చర్యపోయారని చెప్పారు. చివరకు జీవితతోనే ఆయన పెళ్లి జరిగింది.తన కెరీర్ గురించి మాట్లాడుతూ, తాను డాక్టర్ కావాలని కుటుంబం కోరుకున్నా, నటనపై ఆసక్తితో సినిమా రంగంలోకి వచ్చానని చెప్పారు. అలాగే 'చంటి', 'జెంటిల్ మెన్' వంటి హిట్ సినిమాల అవకాశాలు మొదట తన దగ్గరకు వచ్చాయని తెలిపారు. కానీ 'చంటి' సినిమా హక్కులు తీసుకోవడానికి వెళ్తుండగా, అప్పటికే వెంకటేష్ తీసుకున్నారని చెప్పారు.ఈ ఇంటర్వ్యూలో చెప్పిన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు వస్తున్నాయి.



## మీ ప్రేమకు కృతజ్ఞతలు

కొన్నిరోజులుగా త్రిష పేరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న విషయం తెలిసిందే. సోమవారం ఆమె పుట్టినరోజు కావడంతో అభిమానులు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు చెబుతూ ఫొటోలు పంచుకున్నారు. ఇంతమంది ప్రేమను పొందినందుకు ఎంతో ఆనందంగా ఉందని తాజాగా త్రిష ఇన్‌స్టా స్టోరీలో పెట్టారు."మీ అందరూ నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినందుకు ధన్యవాదాలు. మీరు చూపిస్తున్న ఈ అపారమైన ప్రేమకు కృతజ్ఞతలు. వినమ్రంగా ఉంటాను" అని తన స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇక తన పుట్టినరోజు నాడు త్రిష తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వీడియోలు కూడా వైరలయ్యాయి. దర్శనానికి వెళ్తున్న ఓ వీడియోను షేర్ చేసిన ఆమె.. తిరుమల తన హ్యాపీ ప్లేస్ అని పేర్కొన్నారు.ఆమె పుట్టినరోజు సందర్భంగా పలువురు సెలబ్రిటీలు పెట్టిన విషెస్ నెటిజన్‌లను ఆకట్టుకున్నాయి. నటి రాధిక కూడా 'హ్యాపీ బర్త్‌డే.. వాట్ ఏ గిఫ్ట్' అంటూ లవ్ ఎమోజీలు జోడించారు. అలాగే ఇది నీకు బెస్ట్ బర్త్‌డే అని వరలక్ష్మి శరత్‌కుమార్ పేర్కొన్నారు. 'ఈ పుట్టినరోజు చిరస్థాయిలో నిలిచిపోతుంది' అని చార్మి విష్ చేశారు. యూనివర్స్ నీకు మంచి గిఫ్ట్ ఇచ్చిందని మంచు లక్ష్మి అన్నారు. ఇక మే 4న తమిళనాడు ఎన్నికల ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. విజయ్ టీవీకే పార్టీ ప్రభంజనం సృష్టిస్తూ 234 స్థానాల్లో 108ని కైవసం చేసుకుంది.

## డీఎస్పీ సరసన మృణాల్

దర్శకుడు వేణు యెల్దండి, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా తెరకెక్కిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ' గురించి ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. 'బలగం' వంటి భారీ విజయం తర్వాత వేణు రూపొందిస్తున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ ఎంపికైనట్లు సమాచారం. మొదట సాయి పల్లవి, కీర్తి సురేష్ వంటి పేర్లు వినిపించినప్పటికీ, చివరికి కథలోని డెప్త్ నచ్చడంతో మృణాల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.తెలంగాణ మట్టి వాసనతో కూడిన ఎమోషనల్ కథగా రాబోతున్న ఈ చిత్రంలో డీఎస్పీ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచగా, ఇప్పుడు మృణాల్ ఈ ప్రాజెక్టులో చేరడం మరింత హైప్ క్రియేట్ చేస్తోంది. వేణు మార్క్ ఎమోషన్స్, డీఎస్పీ ఎనర్జీ, మృణాల్ పర్ఫార్మెన్స్ కలిసి ఈ సినిమాను మరో లెవల్‌కు తీసుకెళ్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు కురుస్తున్న వర్షం.. ఆరుగాలం శ్రమించిన పంటను ఎక్కడ తుడిచిపెట్టుకుపోతుందో అన్న ఆందోళన.. ఆ అన్నదాతల కళ్లల్లో నిద్రను దూరం చేసింది. తడిసి ముద్దవుతున్న ధాన్యాన్ని చూసి తట్టుకోలేక, కట్టుకున్న ప్రాణాల కంటే పండించిన పంటనే మిన్నగా భావించి, కారు చీకట్లో కల్లానికి పరుగులు తీశారు. కానీ, అపారమైన ఆ ప్రేమను ప్రకృతి అర్థం చేసుకోలేదు. రక్షణ ఇస్తుందనుకున్న గోడలే మృత్యుపాశాలవుతాయని, అక్కున చేర్చుకోవాల్సిన షెడ్డే సమాధి అవుతుందని వారు ఊహించలేదు. గుప్పెడు మెతుకుల కోసం చేసిన పోరాటంలో ఆ నిరుపేద రైతులు ఓడిపోయారు. పంటను కాపాడుకోబోయి ప్రాణాలనే ధారపోశారు. 'లే డాడీ.. ఒక్కసారి చూడవా' అంటూ ఓ చిన్నారి తండ్రి భౌతిక కాయం వద్ద చేస్తున్న ఆర్తనాదాలు చూస్తుంటే, కాలం చేసిన గాయానికి మందు లేదనిపిస్తోంది. ఒకే చితిపై తండ్రీకొడుకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే, లక్షెట్టిపేట మండలం కన్నీటి సంద్రమైంది. ప్రకృతి ప్రకోపానికి బలైపోయిన ఆ నిరుపేద కుటుంబాల గాథలు వింటుంటే.. విధి ఎంత బలీయమైనదో, అన్నదాత బతుకు ఎంత అభాగ్యమైనదో అర్థమవుతోంది.






# అన్నదాతపై ప్రకృతి పగ

# ప్రాణం తీసిన ధాన్యం రక్షణ







- ■ లక్షెట్టిపేట మండలంలో ఘోర విషాదం
- ■ ఈదురు గాలుల బీభత్సానికి గోడ కూలి లక్షెట్టిపేటలో నలుగురు రైతుల దుర్మరణం
- ■ పంటను కాపాడుకోబోతే.. ప్రాణాలే పోయాయి
- ■ అన్నంపెట్టే కల్లమే కాటిగా మారిన వైనం
- ■ ఒకే కుటుంబంలో తండ్రీకొడుకుల మృతి
- ■ గంపలపల్లి, కొత్తూరు గ్రామాల్లో అలుముకున్న చీకటి
- ■ 'లే డాడీ.. ఒక్కసారి చూడవా' కన్నకూతురి ఆర్తనాదాలతో ద్రవించిన హృదయాలు
- ■ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిన ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

అతను ఆకాశం వైపు చూశాడు.. మబ్బులు కమ్ముకుంటుంటే గుండె గుభిల్లుమంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే తడిసి ముద్దవుతుంటే తట్టుకోలేకపో యాడు. చేతికొచ్చిన తలంబ్రాల లాంటి ధాన్యాన్ని కాపాడు కోవాలని కవరు కప్పేందుకు కల్లానికి పరుగులు తీశాడు. కానీ, విధి మరోలా తలచింది. రక్షణ ఇస్తుందనుకున్న షెడ్డే మృత్యు పాశమైంది. అకాల వర్షం అభాగ్యులను బలితీ సుకుంది. గాలి వాన బీభత్సానికి గోడ కూలి నలుగురు అన్నదాతలు కానరాని లోకాలకు వెళ్లిపోయారు.

**కళ్లముందే రాలిపోయిన ప్రాణాలు!**

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలో మంగళవారం రాత్రి ప్రకృతి ప్రకోపానికి పచ్చని సంసారాలు ఛిద్రమయ్యాయి. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవ డంతో గంపలపల్లి, కొత్తూరు గ్రామాల రైతులు తమ ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పేందుకు కొనుగోలు కేంద్రాలకు వెళ్లారు. వర్షం ఉధృతి పెరగడంతో తలదాచుకోవడానికి పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లారు.అదే వారు చేసిన పాపమైంది. బలమైన గాలులకు షెడ్డు గోడ ఒక్కసారిగా కుప్పకూలింది.

**తండ్రీకొడుకులను బలితీసుకున్న విధి..**

గంపలపల్లి గ్రామానికి చెందిన తనుగుల నాగరాజు (50), తన కుమారుడు అభిరాం (22) కలిసి ధాన్యం కాపాడుకోవడానికి వెళ్లారు. ప్రమాదంలో అభిరాం అక్కడికక్కడే మరణించగా, తండ్రి నాగరాజు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో తుదిశ్వాస విడిచాడు. మరో ఘటనలో కొత్తూరుకు చెందిన గుండారపు వెంకటేష్ (24) చిగురుటాకులా రాలిపోయాడు. తన కొడుకును బస్సు ఎక్కించడానికి వెళ్లిన నెల్కి లచ్చన్న (55) కూడా వర్షానికి షెడ్డులో ఆగి, మృత్యువు ఒడిలోకి చేరుకోవడం అందరినీ కలిచివేసింది.

**'ప్లీజ్ డాడీ.. లే డాడీ'.. కలచివేసిన కూతురి రోదన!**

ప్రకృతి సృష్టించిన కల్లోలం కొందరి కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. అకాల వర్షం నుంచి తన పంటను కాపాడుకోవాలని వెళ్లిన ఓ తండ్రి, శవమై తిరిగిరావడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో చోటుచేసుకున్న ఈ హృదయవిదారక ఘటన స్థానికులను, నెటిజన్లను కన్నీరు పెట్టిస్తోంది. మంచిర్యాల జిల్లాలో లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలలు బీభత్సం సృష్టించాయి. రైతులు తమ వడ్లు వర్షానికి తడవకుండా కాపాడుకునేందుకు కల్లాల వద్దకు పరుగులు తీశారు. అనంతరం పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లి నిలబడగా.. బలమైన గాలులకు అది కుప్పకూలింది. దీంతో నలుగురు రైతులు తీవ్ర గాయాలతో మృతిచెందారు. రైతుల భౌతికకాయాలను ఆసుపత్రికి తరలించగా.. అక్కడ



ఓ కూతురు తన తండ్రిని విగతజీవిగా చూసి గుండలవిసేలా రోదించింది. 'ప్లీజ్.. ఒక్కసారి చూడు డాడీ.. లే డాడీ!' అంటూ ఆ చిన్నారి తన తండ్రిని లేపడానికి ప్రయత్నించిన తీరుతో ఆసుపత్రి ప్రాంగణమంతా నిశ్శబ్దం అలముకుంది.

**అండగా ఉంటాం: ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు**

ఈ ఘోర ప్రమాదంపై మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన వ్యక్తిగత తరఫున రూ.2 లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సాయం ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా కూడా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

**ఆసిఫాబాద్ జిల్లాలో మరో విషాదం..**

మరోవైపు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ గాలివాన బీభత్సం సృష్టించింది. చింతలమానెపల్లి మండలం కోర్సిని గ్రామంలో ఇంటి నిర్మాణ పనుల్లో ఉన్న సుగుణ (45)పై ఈదురు గాలుల ధాటికి ఐరన్ బాక్స్ కూలిపడటంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. నిన్నటి వరకు నవ్వుతూ తూగుతూ కనిపించిన ఈ పల్లెలు.. నేడు విషాదంతో నిశ్శబ్దంగా మారిపోయాయి. ప్రకృతి సృష్టించిన ఈ కల్లోలం అన్నదాతల జీవితాల్లో తీరని గాయాన్ని మిగిల్చింది.

**కుటుంబాల్లో విషాదం..**

గాలివాన మూడు కుటుంబాల్లో విషాదం మిగిలి ?చంది. కొత్తూరు గ్రామానికి చెందిన గుండారపు సత్తయ్య, సత్తవ్వ దంపతులకు ముగుర్గు కుమా రులు ఉన్నారు. చిన్న కుఆమరుడు వెంకటేష్ హైదరాబాద్ లో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడుగా ఉంటున్నాడు. వేసవి సెలువులు కావ డంతో కొద్ది రోజుల క్రితం ఇంటికి వచ్చి వ్యవ సాయ పనులు చేస్తున్నాడు. కల్లం వద్ద ధాన్యం కుప్పపై కవరు కప్పడానికి వెళ్లి మృతిచెందడంతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగిపోయారు. దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన నెల్కి లచ్చన్నకు కూతురు, కుమా రుడు ఉన్నారు. కూతురు వివాహం కాగా, కుమారుడు హైదరాబాద్లో బీటెక్ చదువుతు న్నాడు. కుమారుడిని హైదరాబాద్ బస్సు ఎక్కించి గాలివానలో చిక్కుకున్న తండ్రి ఇం టికి చేరకుండానే మృత్యువాత పడడం కలిచివేసింది.

గంపలపల్లి గ్రామానికి చెందిన తనుగుల నాగరాజుకు ఇద్దరు కుమారులు అభిరాం, అఖిల్ ఉన్నారు. పెద్ద కుమారుడు అభిరాం డిగ్రీ పూర్తి చేయగా, చిన్న కుమారుడు డిగ్రీ చదువు తున్నాడు. అభిరాం తండ్రితోపాటు వ్యవ సాయ పనులు చేస్తుంటాడు. ధాన్యం కుప్పలపై కవరు కప్పేందుకు వెళ్లి తండ్రీకొడుకు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ యజమాని, చేతికంది న కొడుకు మృతితో విషాదం నెలకొంది. ఈ అనూహ్య ఘటన గ్రామంలో అందరినీ కంటతడి పెట్టించింది.. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# అకాల వర్షం...అపార నష్టం

- అకాల వర్షంతో తడిసిన ధాన్యం ■ కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో కొట్టుకుపోయిన తీరు
- ఈదురుగాలులకు వందల ఎకరాల్లో రాలిపోయిన మామిడి
- 3వేల ఎకరాల వరి, 411 ఎకరాల మామిడికి నష్టం
- విరిగిపడిన చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు, ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- చేతికి అందిన పంట వర్షార్పణం ■ కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు







(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం వివిధ మండలాల్లోని రైతులు, ప్రజలకు అపార నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షం కారణంగా కొనుగోలు కేంద్రా ల్లో అమ్మకానికి ఉంచిన ధాన్యంతోపాటు కోతకు వచ్చి న పంట పూర్తిగా తడిసి ముద్దకాగా, పెద్ద మొత్తంలో మామిడి నేల రాలి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. గత నాలుగైదు రోజులుగా వాతావరణంలో మార్పులు సంభవిస్తుండగా, ఊహించని రీతిలో అర్ధరాత్రి చెల రేగిన గాలివాన బీభత్సం సృష్టించింది. అకాల వర్షానికి జిల్లాలోని కోటపల్లి, బెల్లం పల్లి, జైపూర్, భీమారం, చెన్నూరు, మందమర్రి, కన్నెపల్లి మండలాల్లోని 1830 మంది రైతులకు చెందిన 3191 ఎక రాల వరి ధాన్యం నీటి పాలైంది. అలాగే జైపూర్, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లోని 140 మంది రైతులకు చెందిన 411 ఎకరాల్లో మామిడి పంట దాదాపు 50 శాతం మేర దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తు న్నా రు. వివిధ మండలాల్లో గాలివాన కార ణంగా విద్యుత్ స్తం బాలు విరిగి పడి విద్యుత్ సరఫ రాలో అంతరాయం ఏర్ప డింది. వృక్షాలు రోడ్లకు అడ్డం గా నేలకొరగడంతో రాకపో కలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. పలుచోట్ల ఇంటి పైకప్పులు ఎరిగిపోగా,గోడలు కూలిపోయి ఇబ్బందులు పడ్డారు.

**రూ. 7 లక్షల పరిహారం...**

లక్షెట్టిపేట మండలంలో అకాల వర్షం కారణంగా వేర్వేరు చోట్లా గోడలు కూలి మృతి చెందిన నలుగు రికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నష్ట పరిహారం ప్రకటించారు. హైద్రాబాద్‌లో ఉన్న ఆయన మృతుల కుటుంబాలను ఉద్దేశించి వీడియో విడుదల చేశారు. ప్రకృతి వైపరీత్యం కారణంగా రైతు లు ప్రాణాలో కోల్పోవడం దుర దృష్టకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తనవంతు గా రూ. 2లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తానని హామీ ఇచ్చా రు. ప్రభుత్వపరంగా మరో రూ. 5 లక్షల పరిహారం ప్ర కటించారు. బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తానని, క్షతగాత్రులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యమే....ఎక్స్‌లో కవిత ట్వీట్**

నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర ది గ్భ్రాంతికి గురి చేసిందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు క ల్వకుంట కవిత ఎక్స్ వేదికగా ఆరోపణలు చేశారు. స కాలంలో ధాన్యం కొ నుగోలు చేయకుండా వారం రోజుల వ్యవధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడుగురు రైతులను పొట్టన బెట్టుకుందని ఆరో పించారు. మృతి చెందిన రైతుల కుటుంబాలను ఎక్స్‌గ్రేషి యా చెల్లించి ఆ దుకోవాలని, ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ఆమె ట్వీట్ చేశారు.

**రైతులకు తీరని నష్టం...**

ఆరుగాలం రెక్కల కష్టం చేసి అప్పులు జేసి పంటలు సాగు చేస్తే ప్రభుత్వం కొనుగోలు చే యకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతు న్నారు. మంగళవారం రాత్రి మండలంలో కురిసిన అకాల వ ర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం వరద తాకిడికి కొట్టుకు పోయింది. నంనూర్ కొనుగోలు కేంద్రంలో రైతు పో తురాజు తిరుపతి ఆరబోసిన ధాన్యం మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు నీటిలో మునిగిపోయింది. అధికారులు వచ్చి న్యాయం చేస్తా రని ఎదురు చూసినా రైతు చేసేదేమి లేక వరద నీటి నుంచి ధాన్యాన్ని తోడడం తోటి రైతులను కలిచి వే సింది. కొనుగోలు కేంద్రంలో సంగతి భూమయ్య అనే రైతుకు సంబంధించి మంగళవారం 355 బస్తాలు తూకం వేశారు. కానీ మిల్లుకు తరలించకపోవడంతో సంచుల్లోని ధాన్యం తడిసిపోయింది. గుడిపేట, ము ల్కల, టీకనపల్లి, బుద్దిపల్లి, పెద్దంపేట, పద్దనపల్లి, రాపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం అ కాల వర్షానికి తడిసిపోవడంతో బుధవారం రైతులు తిరిగి ఆరబెట్టారు. వరద తాకిడికి క్వింటాళ్ల కొద్ది ధాన్యం కొట్టుకుపోయింది. ఇంకా కోతదశలో ఉన్న వరి పొలాలు పూర్తిగా నేలవాలాయి.

**మొక్కజన్నొ రైతులను పట్టించుకునే వారు కరువు...**

వరిధాన్యం తడిసినా కానీ చివరి గింజ వరకు కొ నుగోలు చేస్తామని చెబుతున్నారు కానీ మొక్కజొన్న వర్షానికి తడిస్తే కాటుక రంగు వస్తుందని అప్పుడు అధికారులు కొనుగోళ్లలో కొర్రీలు పెడతారని రైతులు ఆవేదన చెందుతున్నారు. మం డలంలో ఏర్పాటు చేసి న ఏకైక మొక్కజొన్న కొనుగోలు కేంద్రం సబ్బుపల్లిలో ఏర్పాటు చేశారు. ఇక్కడ నిర్వహణ సరిగ్గాలేక గన్నీ సంచులు ఎవరు పడితే వారు తీసుకుపో యారు. ప్ర స్తుతం తూకం వేయడానికి సంచులు లేక ఎక్కడి కుప్పలు అక్కడే ఉన్నాయి ప్రైవేటుకు అమ్ము కున్నా త మకు నష్టం ఎక్కువ ఉండకపోవునని కొను గోలుకేంద్రం నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెన్నూరు మం డలంలో మంగళవారం రాత్రికు రిసిన ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి అస్నాద, లంబడిపల్లి, కొమ్మెర, లిం గంపల్లి, అక్కెపల్లి, అంగ్రాజ్‌పల్లి, కిష్టంపేట తదితర గ్రామా ల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి పో యింది. కొన్ని చోట్ల ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరారు. కొనుగోలు కేంద్రా ల్లో వెంట వెంటనే కొనుగోలు చేపట్టి మిల్లులకు తరలిం చాలని కోరారు. నస్పూర్‌లో గాలి వాన ఆందోళన కలి గిం చింది. భారీగా వీచిన గాలికి చెట్లు, వాటి కొమ్మలు విరిగి సమీపంలోని విద్యుత్ లైన్లపై పడడం, కొన్ని చోట్ల నేల కూ లాయి. ఒక వైపున వర్షం మరో వైపున భారీగా వీచిన గాలి, ఉరుములు, మెరుపులతో కూడి న అకాల వర్షం ప్రజలను కలవరపర్చింది. గాలివాన కారణంగా ప్రభుత్వ, సింగరేణి విద్యుత్ సరఫరా నిలి చిపోయింది. వర్షం వలన డ్రైనేజీలు వర్షపు నీటితో నిండి పొంగిపోర్లాయాయి. సీతారాంపల్లి రైతు వేదిక వద్ద కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కుప్పలపై కప్పి న కవర్లు గాలి దాటికి కొన్ని ఎగిరిపోవడంతో ధాన్యం కొద్ది మే రకు తడిచింది. బుధవారం తడిచిన కుప్పల దాన్యంను రైతులు ఆరబెట్టారు.









# ఆదిలాబాద్‌కు మళ్లీ సున్నా

- కన్నెర్ర చేసిన కాంగ్రెస్ శ్రేణులు ■ అడవి బిడ్డల ఆశలపై నీళ్లు ■ అధిష్టానం చూపు పక్క జిల్లాల వైపు!
- నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకు దక్కని చోటు ■ 20 కార్పొరేషన్ల జాబితాలో 'ఉమ్మడి' ఊసే లేదు!
- సీఎం రేవంత్, పీసీసీ చీఫ్ హామీలు బుట్టదాఖలు.. ■ నమ్మి వచ్చిన నేతలకు మొండిచేయి
- పక్క జిల్లాలకు పదవుల పండగ ■ క్యాడర్‌లో పెల్లుబుకుతున్న అసంతృప్తి ■ పార్టీ బలోపేతంపై నీలినీడలు

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవుల పంపకం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర దుమారాన్ని రేపుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఏదో ఒక రోజు తమకు గుర్తింపు లభిస్తుందని ఆశగా ఎదురుచూస్తున్న జిల్లా నేతల కు తాజాగా ప్రకటించిన 20 కార్పొరేషన్ చైర్మన్ల జాబితా మ రోసారి 'బిగ్ షాక్' ఇచ్చింది. జిల్లాలోని 10 అసెంబ్లీ నియో జకవర్గాల్లో ఏ ఒక్క నేతకూ తాజా జాబితాలో చోటు దక్కక పోవడం జిల్లా పట్ల ప్రభుత్వ వివక్షకు పరాకాష్టగా మారింది.

**మాట తప్పిన మహేష్ కుమార్ గౌడ్..**

**నీటి మూటలైన సీఎం రేవంత్ రెడ్డి హామీలు!**


ఇటీవల నిర్మల్ సమీక్షా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా జిల్లా నేతలతో మాట్లా డుతూ.. ఉమ్మడి జిల్లాకు మూడు కార్పొరేషన్ పదవులు కచ్చి తంగా ఇస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లి, నిర్మల్ సభల సాక్షిగా శ్రీహరి రావు, పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి వంటి నేతల సేవలను కొనియా డుతూ వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. తీరా పదవుల పంపిణీ వచ్చేసరికి ఆ హామీలన్నీ అటకెక్కాయి. జిల్లా ఇంచార్జీ తాహెర్ బిన్ హందాన్ ప్రగల్భాలు కూడా ఉత్తివేనని తేలిపోయింది.

**పక్క జిల్లాలకు పెద్దపీట.. ఆదిలాబాద్‌కు అన్యాయం!**

పదవుల పంపిణీలో పొరుగు జిల్లాలైన నిజామాబాద్, కరీం నగర్‌లకు సర్కారు పెద్దపీట వేస్తోంది. ఇప్పటికే నిజామా బాద్‌లో ఐదుగురు చైర్మన్లు ఉండగా, తాజా జాబితాలో మరో వ్యక్తికి చోటు కల్పించారు. కరీంనగర్‌లోనూ ఇద్దరికి కొత్తగా బాధ్యతలు అప్పగించారు. కానీ భౌగోళికంగా, రాజకీయంగా కీలకమైన ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నేతలను మాత్రం పట్టించుకోకపోవడంపై స్థానిక కాంగ్రెస్ క్యాడర్ రగిలిపోతోంది.

**వలస నేతల్లో పెరిగిన ఆవేదన.. క్యాడర్‌లో నైరాశ్యం!**

బీఆర్ఎస్ బలంగా ఉన్న సమయంలో ఆ పార్టీని వీడి, కష్టకాలంలో కాంగ్రెస్ అండగా నిలిచిన సీనియర్ నేతలకు ఇప్పుడు గుర్తింపు కరువైంది. జిల్లాలో పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో అధిష్టానం ఇలా మొండిచేయి చూ పడం వల్ల భవిష్యత్తులో పార్టీ మనుగడ ప్రశ్నార్థకంగా మారు తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. జిల్లా నేతల ఆవేదన అరణ్య రోదనగానే మిగిలిపోతుందా? లేక అధిష్టానం దిద్దు బాటు చర్యలు చేపడుతుందా? అన్నది వేచి చూడాలి.





# కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ఆత్మీయ వీడ్కోలు





**పరిపాలనలో తనదైన ముద్ర వేసిన కలెక్టర్**
**జిల్లా అధికారుల ప్రశంసలు**
**నిర్మల్‌లో పనిచేయడం మధురమైన అనుభవం**
**కలెక్టర్ భావోద్వేగం అభిలాష అభినవ్**
**టీమ్‌వర్క్‌తోనే అభివృద్ధి సాధ్యమైందని వెల్లడి**
**శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో**
**వీడ్కోలు పలికిన జిల్లా అధికార యంత్రాంగం**

**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా విశేష సేవలందించి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్‌కు బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పరిపాలనలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె చూపిన చొరవ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసేందుకు తీసుకున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం, శాఖల మధ్య సమన్వయం సాధించడం ద్వారా జిల్లాను రాష్ట్ర స్థాయిలో ముందంజలో నిలిపారని అధికారులు గుర్తు చేసుకున్నారు. సన్మాన గ్రహీత కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, భావోద్వేగానికి లోనయ్యారు. నిర్మల్ జిల్లాలో పనిచేయడం తనకు ఒక మధురమైన అనుభవమని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి అధికారి, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. "టీమ్‌వర్క్‌తోనే మనం లక్ష్యాలను సాధించగలిగాం. నిర్మల్ ప్రజల ఆదరాభిమానాలు ఎప్పటికీ గుర్తుంటాయి. పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు చేరువయ్యే ప్రయత్నంలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు," అని తెలిపారు. అనంతరం అధికారులు ఆమెకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్డీవోఅ రత్నకల్యాణి, సిపిఓ జీవరత్నం, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు పంట మార్పిడి పై అవగాహన



**రైతులు సేంద్రియ ఎరువులను వాడాలి**

**దండేపల్లి, మే 6 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్ర జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.సాయి ప్రసాద్,డాక్టర్ పి శివ కుమార్, ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు రసాయనిక ఎరువులు,పురుగు మందులు, అధికంగా వినియోగించడంతో భూసారం తగ్గిపోయి పంట దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. రైతులు సమతుల్య పద్దతులను అనుసరించాలని సూచించారు.రైతులు కేవలం వరి పంటనే కాకుండా ఇతర పంటల మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వరి సాగు చేస్తున్న నేపథ్యంలో పంటల మార్పిడి విధానంలో పెసర, మినుము వంటి పప్పు ధాన్యాలు వేసుకోవాలని రైతులకు తెలిపారు. రైతులు రసాయనిక ఎరువులు కాకుండా జీవామృతలు, చెట్ల కషాయలతో తయారు చేసిన మందులు వాడటం మంచిదన్నారు, పొల్లాలో పశువుల ఎరువులు వేసుకుంటే మంచి దిగుబడితో లాభాలు వస్తాయని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో, వ్యవసాయ విస్తరణ అధికారిణి మౌనిక గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు,ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలి

**నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, మే 6 (ప్రభాత సమాచారం)**

ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును పరిశీలించారు. గోదాములో ధాన్యపు డంపింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లారీలలో వచ్చిన దాన్యపు సంచులను ఎప్పటికప్పుడు భద్రంగా నిలువ చేయాలన్నారు. ఎక్కువమంది హమాలీలను నియమించుకొని వెంటవెంటనే ధాన్యపు సంచుల డంపింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యపు సంచుల వివరాలు, అన్లోడింగ్ కు వరుసలో సిద్ధంగా ఉన్న లారీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్ లు, తహసిల్దార్ రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్‌ను తరిమేద్దాం.. పర్యావరణాన్ని కాపాడదాం





**అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**
**తాటిగూడ పంచాయతీలో వినూత్న ఒరవడి**
**శుభకార్యాల్లో స్టీల్, ఇత్తడి పాత్రల వాడకం**
**గ్రామస్తుల చొరవను స్వయంగా పరిశీలించి**
**అభినందించిన అదనపు కలెక్టర్**
**ఉపాధి హామీ కూలీలకు పూర్తి పనిదినాలు**
**కల్పించాలని ఆదేశం**
**సాలేగూడ రాయి సెంటర్‌లో**
**కొమురంభీమ్‌కు ఘన నివాళులు**

**కాసిపేట, మే 6 (ప్రభాత సమాచారం)**

ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని కాసిపేట మండలం తాటిగూడ గ్రామ పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు తో కలిసి సందర్శించి గ్రామ పంచాయతీ పరిధిలోని రహదారులు, మురుగు కాలువలు, ఓపెన్ వెల్స్, సామాజిక ఇంకుడు గుంతలు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని తెలిపారు. గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని, పూర్తి పని దినాలు కల్పించాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడక నిషేధం గురించి అవగాహన కల్పిస్తూ గ్రామ పంచాయతీలో జరిగే గ్రామ ప్రజల శుభ కార్యక్రమాలకు, ఇతర చిన్న చిన్న కార్యక్రమాలకు కేవలం స్టీల్, అల్యూమినియం, ఇత్తడి వస్తువులను మాత్రమే వినియోగిస్తున్న విషయం తెలుసుకుని గ్రామపంచాయతిని ఆకస్మికంగా సందర్శించి వినియోగిస్తున్న వస్తువులను పరిశీలించి వివరాలు ప్రజలను అడిగి తెల్సుకొని గ్రామ పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని అభినందించారు. అనంతరం మండలంలోని గట్రావుపల్లి గ్రామ పంచాయతీ సాలేగూడ గొండ్వానా పంచాయతీ రాయి సెంటర్ కేంద్రాన్ని సందర్శించి అమరవీరుడు కొమురంభీమ్ కు నివాళులు అర్పించి రాయి సెంటర్ కమిటీ సభ్యులు, గ్రామస్థులతో ముఖా ముఖి కార్యక్రమానికి హాజరయ్యారు. రాయి సెంటర్ విధి విధానాలు, ఉపాధి హామీ పథకం పనులపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సునీల్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సప్దర్ అలీ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, తాటిగూడ సర్పంచ్ మడావి వెంకటేష్, ఉపసర్పంచ్ తమ్మినేడి విజయలక్ష్మి, శ్యామ్ శేఖర్, రాయి సెంటర్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.